క్లుప్తంగా

పాఠశాలల్లో డీఈఓ ఆకస్మిక తనిఖీలు



మంగళగిరి: పట్టణంలోని పలు పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారి రేణుక ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఏడవ వార్డులోని ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసిన డీఈఓ విద్యార్థులను పలు ప్రశ్నలను అడిగి జవాబులు రాబట్టారు. పదవ తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో పదవతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఎంఈవోలు కె.శ్రీనివాసరావు, బాబు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



ఫిరంగిపురం: మండలకేంద్రంలోని ఎస్టీకాలనీలో అక్రమంగా రేషన్ బియ్యం నిలువ ఉంచారన్న సమాచారంతో పోలీసులు మంగళవారం అర్ధరాత్రి దాడి చేసినట్లు సీఐ రవీంద్రబాబు తెలిపారు. కాలనీలోని ఎం.నాగేశ్వరరావు ఇంటి వద్ద 53 గోతాలు, వి. కోటేశ్వరరావు ఇంటిలో 7 గోతాలలో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 22 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకొని కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దాడులలో ఏఎస్ఐ సదాశివరావు, కానిస్టేబుల్ శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

జల్లులతో గుండెఝల్లు



తాడికొండ: వరి రైతులను పెంగల్ తుఫాను వణికిస్తుంది. గత వారం రోజులుగా ఆకాశం మేఘావృతమై ఎప్పుడు వర్షం పడుతుందో తెలియని సందిగ్ధ పరిస్థితితో వణికిపోయిన అన్నదాతలకు మంగళవారం చిరుజల్లులు ఆందోళన కలిగించాయి. ఉదయం గంట పాటు కురిసిన చిరుజల్లుల దెబ్బకు మిషన్ల ద్వారా వరి కోతలు కోసి ధాన్యం ఆరబోసిన రైతులు ఉరుకులు, పరుగులు పెట్టారు. ధాన్యం రాసులను కుప్పలుగా చేసి పట్టలు కప్పి దాచి ఉంచగా, సాయంత్రానికి వాతావరణం కొంచె సహకరించడంతో ఆరబోశారు.

40 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



తాళ్ళాయపాలెం(తాడికొండ): తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 40 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ ఏడుకొండలు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడులలో పులగొండ ఆమోస్‌కు చెందిన గొడ్ల చావిడిలో అక్రమంగా నిల్వ ఉంచిన 40 కేజీల బరువు కలిగిన 40 బస్తాలను స్వాధీనం చేసుకొని విచారించారు. ఈ విచారణలో అబ్బరాజుపాలెం గ్రామానికి చెందిన పులివెలుగుల రాజు తన ఇంట్లో ఇరుకుగా ఉన్నందున తమ ఇంటి చావిడిలో పెట్టుకుంటానని అడిగిన మేరకు అంగీకరించినట్లు తెలిపారు. అక్రమ నిల్వలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఆస్తి వివాదం నేపథ్యంలో హత్య జరిగి ఉంటుందని అనుమానం

తాడికొండ: ఆస్తి వివాదాల నేపథ్యంలో అనుమానాస్పదంగా ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన తుళ్లూరు మండలం రాయపూడి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తుళ్లూరు మండలం రాయపూడి గ్రామానికి చెందిన చిలకా చంద్రశేఖర్ తన కుమారుడు చిలకా కోటేశ్వరరావు ఇంట్లో బుధవారం తెల్లవారు జామున మృతి చెందాడు. రెండు రోజుల క్రితం తన తండ్రి ఆస్తిపై ఆయన చివరి భార్య మల్లేశ్వరి, తన అక్కలు కోర్టులో దావా వేశారని, దీనిపై నోటీసులు రెండు రోజుల క్రితం అందడంతో ఈ విషయంపై తమ అక్కలతో మాట్లాడి వచ్చిన అనంతరం తన తండ్రి రాత్రి 11 గంటలకు పడుకొని నిద్రపోయాడని తెల్లవారు జామున 4 గంటలకు లేచి చూడగా ఇంటి బయట మృతి చెంది పడి ఉన్నాడని దీనిపై విచారణ చేయాలని మృతుడి కుమారుడు చిలకా కోటేశ్వరరావు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.అంకమ్మ తెలిపారు.

దినదిన గండం!

- గుంటూరు – కర్నూలు రాష్ట్ర రహదారిపై వేగంగా వాహనాల రాకపోకలు
- ఫిరంగిపురం వద్ద పలు విద్యాసంస్థలు
- రోడ్డు దాటేందుకు ప్రతిరోజూ ఇబ్బందులే..
- స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా గీతలు మచ్చుకైనా కానరాని వైనం
- పట్టించుకోని అధికారులు



యూనియన్ బ్యాంకు వద్ద రోడ్డు దాటేందుకు ఆగిన విద్యార్థులు

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని ఫిరంగిపురంలో పలు పాఠశాలలు, కళాశాలల వద్ద వాహనాల వేగాన్ని నిరోధించే స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా గీతలు లేక విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలకు వెళ్లే క్రమంలో రోడ్డు దాటాలంటే నానా తంటాలు పడాల్సి వస్తుందని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విపరీత రద్దీ

గుంటూరు-కర్నూలు రాష్ట్ర రహదారి ఇరుపక్కల ఫిరంగిపురం గ్రామం ఉంది. ఒక్క ఫిరంగిపురమే కాకుండా మండలంలోని పలు గ్రామాలు సైతం ఈ రహదారి పక్కనే ఉన్నాయి. రాష్ట్రరహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు ఈ రోడ్డుపై రాకపోకలు చేస్తుంటాయి. లారీలు, బస్సులు వంటి భారీవాహనాలు కార్లు, ఆటోలు వంటివి వేగంగా ప్రయాణిస్తుంటాయి. ఈక్రమంలో పాఠశాలలు, కళాశాలలు వద్ద ప్రమాద సూచికలు తెలిపే బోర్డులుకాని, వేగనిరోధాన్ని తగ్గించే స్పీడు బ్రేకర్లు గానీ, రోడ్డు దాడేందుకు ఉపయోగించే జీబ్రా గీతలు గానీ లేకపోవడంతో విద్యార్థులకు దినదిన గండంగా మారింది. ఫిరంగిపురంలోని సెయింట్ ఆన్స్ పాఠశాల వద్ద, సెయింట్‌పాల్స్ పాఠశాల వద్ద, మరియు మార్నింగ్‌స్టార్ కళాశాల, దీనాపూర్ కళాశాలల వద్ద ప్రమాద సూచికలు, స్పీడ్ బ్రేకర్లు లేవు. దీంతో వేగంగా వస్తున్న వాహనదారులతో విద్యార్థులు, స్థానికులు నిత్యం తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

వేగ నిరోధకాలు ఏవీ..?

పాఠశాల, మరియు కళాశాలలకు ఉదయం వెళ్లే క్రమంలో విద్యార్థులు రోడ్డు దాటాలంటే ఎక్కువ సమయం వేచి ఉండి, దాటాల్సి వస్తుంది. ఈ సమయంలో అటు నుంచి.. ఇటు నుంచి వచ్చే



చర్చిసెంటర్ వద్ద ప్రమాదకరంగా నిలబడిన విద్యార్థులు

వాహనాలు తగిలి విద్యార్థులు, స్థానికులు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు గతంలో ఉన్నాయి. కొందరు తీవ్రంగా గాయపడగా మరి కొందరు చికిత్సపొందుతూ మృతి చెందినవారు సైతం ఉన్నారు. ఇటీవల తాళ్లూరు బస్టాండు సమీపంలో గుంటూరు నుంచి వస్తున్న లారీ నాలుగు ద్విచక్రవాహనాలపైగా వెళ్లింది. ఈసంఘటనలో వాహనాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు.

కళాశాల వద్ద పెట్రోలు బంకులోకి వాహనాలు వెళ్లే క్రమంలో స్పీడ్ బ్రేకర్లు లేక ప్రమాదాలు ఎన్నో సంభవించాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



పాఠశాల వద్ద రహదారిపై ప్రమాద సూచికలు లేక చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రతిరోజూ పెద్దవారు ఉండి రోడ్డు దాటించాల్సి వస్తుంది. కొన్ని సార్లు రోడ్డు దాటేక్రమంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి.

– మాయకుంట్ల రాజీ, ఫిరంగిపురం

చర్యలు తీసుకోవాలి..



గ్రామంలోని పాఠశాలలు, కళాశాలల వద్ద ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలి. రోడ్డు దాటేక్రమంలో ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి. స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా లైన్లు లేక వాహన చోదకులు వేగంగా ప్రయాణిస్తున్నారు.

– రావూరి నారాయణ, ఫిరంగిపురం

రేపు ముక్కోటి ఉత్సవాలపై సమీక్ష

మంగళగిరి: పట్టణంలో వేంచేసి వున్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి ముక్కోటి ఉత్సవాలకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎ.రామకోటిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 10వ తేదీ జరగనున్న ముక్కోటి ఉత్సవానికి సంబంధించి ఈ నెల 6వ తేదీ ఉదయం 11 గంటలకు ఆలయ ఆవరణలో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు పాల్గొననున్నట్లు తెలిపారు.

ఘనంగా ఉన్నవ లక్ష్మీనారాయణ జయంతి

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో బుధవారం వేములూరిపాడు గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు ఉన్నవ లక్ష్మీనారాయణ జయంతిని ఘనంగా నిర్వహించారు. మూలాంకురేశ్వరి దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బి.వేణుగోపాలబాబు ఆధ్వర్యంలో ఉన్నవ లక్ష్మీనారాయణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందజేశారు. బి.కుమారస్వామి, పాఠశాల ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న లారీ స్వాధీనం

తాడికొండ: అక్రమంగా ఇసుకను లోడ్ చేసి తరలిస్తున్న లారీ, పొక్లెయిన్‌లను పట్టుకొని సీజ్ చేసినట్లు తుళ్లూరు ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు. వివరాల ప్రకారం తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం రాజధాని శంకుస్థాపన ప్రదేశం పక్కన నిల్వ చేసిన ఇసుక కుప్పలను పొక్లెయిన్ సాయంతో లోడ్ చేస్తుండగా బుధవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. ఈ దాడిలో ఓ పొక్లెయిన్‌తో పాటు, లారీని సీజ్ చేసి డ్రైవర్‌లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

'అపార్' తిప్పలు తొలగించాలి

తాడేపల్లిరూరల్: లేట్ బర్త్ సర్టిఫికెట్లకు ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. బుధవారం దుగ్గిరాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు అపార్ ఐడీ క్రియేట్ చేయడం కోసం స్కూల్ రికార్డ్స్, ఆధార్ అన్నింటిలో ఒకేవిధంగా ఉండాలని చెప్పడం తగదని, ఆధార్ కార్డులో విద్యార్థులు మార్పులు, చేర్పులకు బర్త్ సర్టిఫికెట్ కోసం ఇబ్బందులు పడుతున్నారని, ప్రస్తుతం గ్రామాల్లో వ్యవసాయ పనులతో బిజీగా ఉండే విద్యార్థుల తల్లిదండ్రులు వ్యవసాయం, కూలి పనులు మానుకుని సంబంధిత కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరిగాల్సి వస్తోందని, విద్యార్థులు, తల్లిదండ్రుల ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం జోక్యం చేసుకుని సచివాలయాల ద్వారా విచారణ చేయించి బర్త్ సర్టిఫికేట్‌ను ఇవ్వాలని కోరుతున్నామన్నారు. విద్యార్థి దరఖాస్తు చేసుకోవడానికి రూ. 100, నోటరీ అఫిడవిట్ చేయించుకోవడానికి రూ.200, నాన్ అవైలబిలిటీ కోసం రూ.50 చెల్లించాల్సి వస్తోందని, విద్యార్థులపై ఆర్థిక భారం పడుతుందని, ప్రభుత్వం తక్షణం స్పందించి బర్త్ సర్టిఫికేట్ల మంజూరులో విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

అమరావతిలో భూకంపం కలకలం

అమరావతి: మండల కేంద్రమైన అమరావతిలో బుధవారం ఉదయం భూకంపం కలకలం రేపింది. బుధవారం ఉదయం 7.28గంటలకు సుమారు 3నుంచి 4సెకన్లపాటు భూమి కంపించింది. భూమి కంపించటంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. గ్రామంలో ప్రజలు భూకంపం గురించి చర్చించుకోవటం కనిపించింది.

రేపటి నుంచి నియోజకవర్గంలో పర్యటిస్తా

- ప్రజలకు అండగా నిలిచి పార్టీలకతీతంగా పోరాడి న్యాయం చేయడమే అజెండాగా గ్రామాల్లో పర్యటన
- వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వనమా బాల వజ్రబాబు

తాడికొండ: ఈ నెల 6వ తేదీ నుంచి తాడికొండ నియోజకవర్గంలో తుళ్లూరు మండలం వెంకటపాలెం గ్రామం నుంచి తన పర్యటనను ప్రారంభిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు అన్నారు. బుధవారం గుంటూరు మల్లికార్జునపేటలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 6న గుంటూరులోని తన కార్యాలయం నుంచి ర్యాలీగా బయల్దేరి తాడికొండ మండలం లాం, తాడికొండ గ్రామాల్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం తుళ్ళూరు మండలం వెంకటపాలెం గ్రామంలోని టీటీడీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో పార్టీని అన్ని విధాలా ముందుకు నడిపించి బలోపేతం చేసి రాబోయే ఎన్నికల్లో ఘన విజయం సాధించేందుకు నాయకులు, కార్యకర్తల అండదండలతో ముందుకెళతానన్నారు. అధిష్టానం ఆదేశాల మేరకు గతంలో ఉన్న పార్టీ కమిటీలు రద్దయినందున నూతనంగా కమిటీల ఏర్పాటు చేస్తున్నామని, కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్త, నాయకుడికి అందులో చోటు కల్పిస్తున్నామని గ్రామాల్లో అందరి ఏకాభిప్రాయంతో ఇదంతా పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తామన్నారు. ఇకపై తాను, పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా గ్రామాల్లో పర్యటించి సమస్యలపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల ముఖ్య నాయకులు బత్తుల కిషోర్, ముప్పాళ్ళ మనోహర్, చిట్టా అంజిరెడ్డి, కొప్పుల శేషగిరిరావు, దాసరి రాజు, వంగా పోలారెడ్డి, ఉండవల్లి నరసింహారావు పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కార్మికులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుంది

- స్థానిక మంత్రి వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలి
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు మద్దతు పలుకుతున్న దొంతిరెడ్డి వేమారెడ్డి, నాయకులు

తాడేపల్లిరూరల్: బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని పార్టీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. బుధవారం బ్రహ్మానందపురంలో సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దొంతిరెడ్డి మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు న్యాయం జరిగే వరకు అన్ని ప్రజా సంఘాలు, పార్టీలు ఏకమై పోరాటం నిర్వహించాలని, కార్మికుల న్యాయమైన పోరాటానికి తమ పార్టీ నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమస్య పరిష్కారానికి ముందుకు రావాలని, స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ ఈ విషయంలో జోక్యం చేసుకుని కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. ప్రభుత్వ అధికారులు కార్మికుల గుడిసెలు తొలగించడం అన్యాయమని, వైఎస్సార్‌టీయూతో పాటు అన్ని కార్మిక సంఘాలు మద్దతు తెలియజేస్తున్నాయన్నారు. పార్టీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, దర్శి రమేష్, ఐఎఫ్‌టీయూ నాయకులు యు.నాగేశ్వరరావు, కె.కోటయ్య, ఏఐటీయూసీ నాయకుడు కంచర్ల కాశయ్య, సీఐటీయూ, రైతు సంఘం నాయకులు వేముల దుర్గారావు, బూరగ వెంకటేశ్వర్లు, జొన్న శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకట్ రెడ్డి, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కె.ఆదినారాయణ, ఎస్‌కె బాష, యెహోషువ, ఎం.ఆశీర్వాదం, బి.అంకయ్య, సాంబశివరావు, ఎం.గురవయ్య, సుబ్బారావు, కార్మికులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

ఫిరంగిపురం: మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సంబంధిత అంశాలపై ఈనెల 6నుంచి జనవరి 8వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జె.ప్రసాదరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తేదీ అమీనాబాద్, 10న 113.త్యాళ్లూరు, 11న తక్కెళ్లపాడు, 12న శిరంగిపాలెం, 13న యర్రగుంట్లపాడు, 17న బేతపూడి, 18న గుండాలపాడు, 19న పొనుగుపాడు, 20న మేరికపూడి, 24న నుదురుపాడు, 27న వేమవరం, 31న రేపూడి, జనవరి 2న హౌస్‌గణేష్‌పాడు, 3వ తేదీన ఫిరంగిపురం గ్రామాల్లో నిర్వహిస్తామని చెప్పారు.

తాడేపల్లిలో..

తాడేపల్లిరూరల్: తాడేపల్లి తహశీల్దార్ కార్యాలయం ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు కార్యక్రమాల వివరాలను తాడేపల్లి తహసీల్దార్ సీతారామయ్య బుధవారం విడుదల చేశారు. డిసెంబర్ 6వ తేదీ వడ్డేశ్వర గ్రామ సచివాలయంలోను, 10న ఇప్పటం, 11న మెల్లెంపూడి, 12న కుంచనపల్లి, 17న తాడేపల్లి మున్సిపల్ కార్యాలయం, 19న ఉండవల్లి, 21న పెనుమాక, 24న కొలనుకొండ, 26న గుండిమెడ, 27న ప్రాతూరు, 28వ తేదీ , చిర్రావూరు గ్రామ సచివాలయంలో నిర్వహించనున్నామని ఆయన తెలిపారు.

దుగ్గిరాలలో....

దుగ్గిరాల తహశీల్దార్ సునీత దుగ్గిరాల మండల పరిధిలో జరిగే రెవెన్యూ గ్రామ సదస్సులను బుధవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. డిసెంబర్ 6వ తేదీ గొడవర్రు, 10 పెదకొండూరు, 12 పెరుకల పూడి, 13ఈమని, 17 దుగ్గిరాల, 19పెనుమూలి, 21 చిలువూరు, 24 దేవరపల్లి, 26 చింతలపూడి, 28 శృంగారపురం, 31చినపాలెం, జనవరి 2 మోరంపూడి, జనవరి 4 తుమ్మపూడి, జనవరి 8వ తేదీ కంఠంరాజు కొండూరులో ఈ గ్రామ సభలు నిర్వహించనున్నామని భూ సమస్యలు ఉన్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తహశీల్దార్ సూచించారు.

ఆరోగ్య కార్యక్రమాల అమలు పక్కాగా ఉండాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ కె.విజయలక్ష్మి



ఆసుపత్రికి వచ్చిన వారి నుంచి వివరాలు సేకరిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ కె. విజయలక్ష్మి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కె.విజయలక్ష్మి బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ముందుగా హాజరు పట్టీని, ఎఫ్ఆర్ఎస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ఎన్‌సీడీ 3.0 సర్వే, పాఠశాల విద్యార్థులకు స్క్రీనింగ్, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు పక్కాగా ఉండాలన్నారు. కేంద్రంలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి సూచనలు, సలహాలు అందజేశారు. ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలు ఎక్కువగా జరిగేటట్లు ప్రజలను ప్రోత్సహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వివరించారు. దుగ్గిరాల పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ అబ్దుల్ రహమాన్, ఇతర వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించి అండగా నిలుస్తాం

మంత్రి నారా లోకేష్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేష్

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గ పరిధిలోను, రాష్ట్రవ్యాప్తంగా వచ్చే ప్రజా ఫిర్యాదులను, సమస్యలను పరిష్కరించి బాధితులకు అండగా ఉంటామని విద్యాశాఖ, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. బుధవారం ఉండవల్లిలోని తన నివాసంలో నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌కు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తరలి వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ వారి వద్ద నుంచి వినతిపత్రాలు స్వీకరించి పలు సమస్యల పరిష్కారానికి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. మంగళగిరి నియోజకవర్గంలో కేఎల్ యూనివర్సిటీ నుంచి రేవేంద్రపాడు వరకు ఉన్న రహదారి పూర్తిగా ధ్వంసమైందని, మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని గుండిమెడకు చెందిన సరిత విజ్ఞప్తి చేశారు. వారం క్రితమే కేఎల్‌యూ వరకు రోడ్డు మరమ్మతులు చేసి అనంతరం పనులు నిలిపివేశారన్నారు. ఈ మార్గంలో ప్రయాణికులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారని, రాత్రిళ్లు ఎలాంటి రవాణా సౌకర్యం ఉండడం లేదని, వీధి లైట్లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందని మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన మంత్రి గుండిమెడ పంచాయతీలో వీధి లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు, రోడ్డుపై ప్రమాదకరంగా మారిన గుంతలను పూడ్చే విధంగా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో పోటీలు

తాడేపల్లిరూరల్: సీపీఐ శత వసంత కాలం పూర్తి చేసుకుంటున్న సందర్భంగా గుంటూరు జిల్లావ్యాప్తంగా ఏకపాత్రాభినయం, పాటల పోటీలను నిర్వహిస్తున్నట్లు ప్రజా నాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షుడు కంచర్ల కాశయ్య తెలిపారు. బుధవారం మంగళగిరి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షుడు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు, సీనియర్ కళాకారుడు సందుపటల భూపతిలు మాట్లాడారు. సీపీఐ ఈనెల 26వ తేదీ నాటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో ఏకపాత్రాభినయం పోటీలు, పాటల పోటీలు నిర్వహిస్తున్నామని, ఆసక్తి గల వారు పాల్గొనాలని కోరారు. ఈనెల 8వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటలకు గుంటూరు కొత్తపేట పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్నామని, కళలు, సాహిత్యం పట్ల ఆసక్తి గల యువ కళాకారులు ఈ పోటీలలో పాల్గొనవచ్చునని వారు తెలిపారు. పోటీల విజేతలను డిసెంబర్ 16, 17 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రవ్యాప్త పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని వారు అన్నారు.

ఎన్ఆర్ఐ కళాశాలలో దంత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

మేడికొండూరు: మేడికొండూరు సమీపంలోని ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం దంత వైద్య శిబిరం జరిగింది. శిబిరంలో గుంటూరు, లక్ష్మీపురం ఆస్ట్రేలియన్ డెంటల్ క్లినిక్ వైద్య సిబ్బంది విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. దంత వైద్యుడు డాక్టర్ రావిపాటి మాట్లాడుతూ భారత దేశంలో 50 శాతం మంది దంత సమస్యలతో బాధపడుతున్నారన్నారు. నోరు, నాలుక వాపు వంటి తీవ్రమైన అనారోగ్యాలు కూడా దంత సమస్యలకు కారణమన్నారు. డాక్టర్ వేలేటి విష్ణు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజుకు రెండుసార్లు దంతాలు శుభ్రం చేసుకోవాలన్నారు. నోటి దుర్వాసన దంత సమస్యలకు సంకేతమని, దంత వైద్యులను సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. డాక్టర్ అచ్యుత్ మాట్లాడుతూ నూతన టెక్నాలజీ ద్వారా పోగొట్టుకున్న, అరిగిపోయిన, పుచ్చిపోయిన దంతాలను మళ్లీ పెట్టవచ్చన్నారు. అధునాతన రూట్ కెనాల్ వంటి నూతన మార్గాలు ఉన్నాయని వెల్లడించారు. సుమారు 200 మంది విద్యార్థులకు దంత పరీక్షలు చేసి, మందులు, పేస్టులు, మౌత్ ఫ్రెష్‌లు ఉచితంగా అందజేశారు. శిబిరంలో కళాశాల ప్రిన్సిపాల్ కోట శ్రీనివాస్, ఆస్ట్రేలియన్ డెంటల్ క్లినిక్ మేనేజర్ బి.పవన్ కళ్యాణ్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

గొలుసు అపహరణకు యత్నం

- ప్రతిఘటించిన మహిళ
- బైక్‌పై పరారైన గుర్తుతెలియని వ్యక్తి

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి కొత్తూరులో ఓ మహిళ మెడలో గొలుసు అపహరణకు బుధవారం గుర్తుతెలియని వ్యక్తి ప్రయత్నించాడు.. మహిళ గట్టిగా ప్రతిఘటించడంతో పారిపోయాడు. సేకరించిన వివరాల ప్రకారం.. తాడేపల్లి కొత్తూరుకు చెందిన శ్రీనివాస్ రెడ్డి భార్య తన ఇంటి ముందు వున్న షాపు వద్ద నిలబడి ఉండగా ఓ గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి మహిళ మెడలో గొలుసు తెంచుకుని పారిపోవడానికి ప్రయత్నించాడు. సదరు మహిళ ప్రతిఘటించడంతో ఆ వ్యక్తి ప్రయత్నం విఫలమైంది. వెంటనే తన ద్విచక్ర వాహనంపై పరారయ్యాడు. కొంతమంది స్థానికులు దొంగను వెంబడించినా ఫలితం లేకుండా పోయింది. ఇటీవల కాలంలో చైన్ స్నాచింగ్‌లు తగ్గుముఖం పట్టాయి. కానీ బుధవారం జరిగిన ఈ ఘటనతో మహిళలల్లో భయాందోళనలు చోటు చేసుకుంటున్నాయి.